సాక్షి ఒడిశా

గురువారం । 29 । మే । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,80,436లు, బంగారం 7గ్రాముల 600 మిల్లీగ్రాములు, వెండి 70 గ్రాముల 900 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అవగాహన అవసరం

సంక్షేమ పథకాలపై అధికారులు సమగ్ర సమాచారం కలిగి ఉండాలని గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు.

- 8లో



రోడ్డును విస్తరించాలి

పర్లాకిమిడి టౌన్ రోడ్డును పూర్తిగా విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బసంత పండా బుధవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

- 8లో

రాష్ట్రంలోకి 'నైరుతి'



పాతపట్నం - పర్లాకిమిడి సరిహద్దులో కురుస్తున్న వర్షం



పర్లాకిమిడిలో మహేంద్రతనయ నదికి చేరిన వరదనీరు

- ముందస్తుగా ప్రవేశించిన రుతుపవనాలు
- విస్తారంగా వర్షాలకు అవకాశం
- అప్రమత్తం చేస్తున్న అధికారులు

భువనేశ్వర్:

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసినట్లుగా రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందస్తుగానే బుధవారం ప్రవేశించాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు మొదలు కాగా, రానున్న రెండు, మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రం అంతటా విస్తరించే అవకాశం ఉందని ఐఎండీ శాస్త్రవేత్త ఉమాశంకర్ దాస్ తెలిపారు. రుతుపవనాల ఆగమనంతో వడగాడ్పుల పరిస్థితుల నుంచి ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. రుతుపవనాలు తొలుత మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లాల్లో విస్తరించాయి. కలహండి, రాయగడ, గజపతి జిల్లాలకు పాక్షికంగా తాకాయి. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ వివిధ జిల్లాలకు భారీ వర్షాలు, ఈదురు గాలుల హెచ్చరికలు జారీ చేసింది. దీని ప్రకారం బాలాసోర్, జాజ్‌పూర్, గంజాం జిల్లాల్లో బలమైన గాలులతో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా. కొన్ని ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ ముందస్తు సమాచారం జారీ చేసింది.

హెచ్చరికలు జారీ..

రాష్ట్రంలో 9 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ హెచ్చరిక జారీ అయింది. ఈ జాబితాలో ఖుర్ధా, నయాగఢ్, బౌద్, కంధమల్, కలహండి, గంజాం, రాయగడ, ఝూర్సుగుడ, సుందర్‌గఢ్ జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో భారీ వర్షపాతం వచ్చే అవకాశముంది. జగత్‌సింగ్‌పూర్, పూరీ, కటక్, కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ అయ్యింది. ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశముంది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, చేపల వేట కోసం మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరించారు.

అల్ప పీడనం..

రాష్ట్ర తీరం వాయువ్య బంగాళా ఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడిందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఈ వ్యవస్థ నెమ్మదిగా ఉత్తరం వైపు కదిలి రానున్న 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉంది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో బలమైన గాలులు కూడా వీస్తాయని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అన్ని జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

విస్తారంగా వానలు

పర్లాకిమిడి: రుతు పవనాల ద్రోణి ప్రభావంతో గజపతి జిల్లాలో కాశీనగర్, గుమ్మా, పర్లాకిమిడి, ఆర్.ఉదయగిరి, మోహనా, నువాగడ సమితుల్లో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల వల్ల జనజీవనం స్తంభించింది. మహేంద్రతనయ, వంశధారలో నీరు చేరింది. ఈ ఏడాది ఖరీఫ్‌కు విత్తనాలు వేయడానికి రైతులు దుక్కులు దున్నుతున్నారు. ఈ ద్రోణి వల్ల ఈ నెల 30 వరకూ రాష్ట్రమంతటా వర్షాలు కురుస్తాయని మాజీ ఐఎండీ వాతావరణ నిపుణులు డా.శరత్ చంద్ర సాహు తెలిపారు.



పోస్టర్లను ప్రారంభిస్తున్న అధికారులు

ప్రారంభమైన చైతన్య రథం

రాయగడ: వర్షాకాలంలోఉరుములు, మెరుపులు కురిసే సమయంలో ప్రాణ సంకటంగా మారుతున్న పిడుగులపై ప్రజలను చైతన్యపరిచేందుకు చైతన్య, ప్రచార రథాన్ని కలెక్టర్ ఫరూల్ పట్వారి ప్రారంభించారు. జిల్లాలో 11 సమితుల్లో ఈ రథం తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రాయగడ జిల్లాలో ఇటీవల కాలంలో పిడుగుపాటు మృతులు ఎక్కువగా ఉండటంతో జాగ్రత్త చర్యలను వివరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ నిహారి రంజన్ కుహోరో, ఏడీఎం రమేష్‌చంద్ర నాయక్, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్ సహోట, రాయగడ సబ్ కలెక్టర్ రమేష్ చంద్ర జెన్నా, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, జిల్లా సామాజిక సుర‌క్షా శాఖ అధికారి శ్రీకాంత్ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.



రాయగడలో ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పట్వారి

న్యూస్‌రీల్

ఫార్వర్డ్ బ్లాక్ నేతల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పైల మురళీకృష్ణ తదితరులు

పర్లాకిమిడి : మహేంద్ర తనయ నది ఒడ్డున ఉన్న బృందావన ప్యాలెస్‌లో ఈ నెల 6న చోరీకి గురైన పురాతన ఐరన్ రైలింగ్‌పై పోలీసులు దర్యాప్తు చేసి దోషులను అరెస్టు చేయాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షుడు పైల మురళీక్రిష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదర్శ పోలీసుస్టేషన్ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. హెరిటేజ్ ప్యాలెస్ సంరక్షణకు వాచ్‌మ్యాన్‌ను నియమించాలని, రాష్ట్ర పర్యాటక శాఖ స్పందించి ప్యాలస్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం ఎస్ఐ బలరాం బెహరాకు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



ఘటనా స్థలంలో మృతదేహాలు

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. జిల్లాలోని గుణుపూర్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి మృతి చెందిన వారు శిరిజోలి పంచాయతీ బొడొఅంబగుడ గ్రామానికి చెందిన తిరుపతి సాబొరొ (40), అతని మేనల్లుడు ముండా సాబొరొ(18)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వీరిద్దరూ బైక్‌పై వెళ్తుండగా కొయిలొపాదొరొ ప్రధాన రహదారి వద్ద ఆగి ఉన్న ఒక లారీని ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

రహదారి ఇలా.. రాకపోకలెలా?



గోతులమయంగా మారిన బొరిగుమ్మ-కొరాపుట్ రోడ్డు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ నుంచి జిల్లా కేంద్రంలోని కొరాపుట్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా గోతులు ఏర్పడటంతో రాకపోకలకు వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. కొద్దిపాటి వర్షమొచ్చినా గోతుల్లో నీరు నిలిచిపోతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో 6 కిలోమీటర్లు తెలింగిరి సాగునీటి ప్రాజెక్టు ఆధీనంలో ఉండగా, మిగతా భాగంగా రోడ్డు భవనాల విభాగం పరిధిలో ఉంది. నవరంగపూర్, బొరిగుమ్మ, కొట్‌పాడ్, ఛత్తీసగఢ్ రాష్ట్రానికి జయపురం రాకుండా కొరాపుట్ వెళ్లేందుకు దగ్గరిదారి. అందుకే ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

జర్నలిస్టుపై దాడికి ఖండన



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్కన్‌గిరి జర్నలిస్టులు

మల్కన్‌గిరి: బాలంగీర్ జిల్లాలో జర్నలిస్టుపై దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్కన్‌గిరి యూనియన్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మల్కన్‌గిరి కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్కన్‌గిరి యూనియన్ జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు దేబో ప్రసాద్‌దాస్ మాట్లాడుతూ జర్నలిస్టు కాళ్లు చేతులు కట్టేసి అమానుషంగా ప్రవర్తించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఈ దారుణ కాండను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదే విధంగా, జిల్లా ఉత్కళ జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు అశోక్ మిశ్రో నేతృత్వంలో జర్నలిస్టులు సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంయూజీ ప్రతినిధులు ఎస్ఎన్ పండా, శివ ప్రసాద్ కీర్తనీయా, ఈశ్వర్ అద్దంకి, జనీకి పట్నాయిక్, నీలు పాడీ, ఉత్కళ జర్నలిస్టు సంఘం సభ్యులు రత్నాకర్ దాస్, నివాస్ పాత్రో, చరణ్ మహంతి, గౌరీ శంకర్ పండా, దిలీప్ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే ఆస్పత్రికి రావొద్దు



జేకేపూర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి ఇదే



ఆస్పత్రి ప్రాంగణంలో అతికించిన పోస్టర్

- డాక్టర్లు, సిబ్బంది తగినంతగా లేరు
- గోడపై పోస్టర్ అతికించిన జేకేపూర్ ఈఎస్ఐ ఆస్పత్రి నిర్వాహకులు

రాయగడ: 'అత్యవసర చికిత్స కోసం ఇక్కడకు రావొద్దు.. డాక్టర్లు, వైద్య సిబ్బంది కొరతగా ఉన్నారు..' అంటూ సదరు సమితిలోని జేకేపూర్ ఈఎస్ఐ ఆస్పత్రి గోడపై నిర్వాహకులు పోస్టర్ అతికించడం చర్చనీయాంశమైంది. పరిశ్రమల కార్మికులు ఎక్కువగా వినియోగించుకునే ఈ ఆస్పత్రిలో కొన్నాళ్లుగా సమస్యలు తాండవం చేస్తున్నాయి. ప్రస్తుతం డాక్టర్లు, వైద్య సిబ్బంది కొరత కారణంగా దాదాపు ఈఎస్ఐ ఆస్పత్రి మూతపడే దిశకు చేరువవుతోంది. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా రోగులు అత్యవసర చికిత్స సమయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం అంబులెన్స్ సేవలు కూడా లేకపోవడంతో రోగులు ఇబ్బందులపాలవుతున్నారు. ఇక రాత్రివేళ పూర్తిగా వైద్య సేవలను నిలిపివేసారు. ఈ ఆస్పత్రిపై ఆధారపడి సుమారు 14 వేల ఈఎస్ఐ కార్డు దారులు ఉన్నారు. 1978లో జేకేపూర్‌లో ఆస్పత్రి ప్రారంభించారు. 35 పడకల సామర్థ్యం గల ఈ ఆస్పత్రిలో 14 మంది డాక్టర్లకు గాను ప్రస్తుతం ముగ్గురే సేవలు అందిస్తున్నారు. మూడు పడకలే రోగులకు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆస్పత్రి సమస్యలపై దృష్టి సారించాలని ఈఎస్ఐ కార్డుదారులు కోరుతున్నారు.

అలరించిన కవితా పఠనం



సభకు హాజరైన సభ్యులు

జయపురం: జయపురం సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో రైలులో నిర్వహించిన కవితా పఠనం ప్రయాణికులను అలరించింది. జగదల్‌పూర్‌కు చెందిన సాహిత్య పరిషత్ సభ్యులు మంగళవారం సాయంత్రం ద్విభాషా సాహిత్య సమారోహంలో పాల్గొనేందుకు రైలులో వెళ్లగా రేలారే రేలారే పాట, కవితలతో ప్రయాణికులను ఉత్సాహపరిచారు. పలువురు సభ్యులు ప్రకృతి అందాలపై కవితలు వినిపించారు. అనంతరం జగదల్‌పూర్ ఉత్కళ సమాజ్ సభ్యులు ద్విభాషా సాహిత్య సమారోహం జరిగింది. జయపురం సాహిత్య పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మానవ విజ్ఞాన సంస్థ అధ్యక్షులు డా.ప్రియూషరంజన్ సాహు తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో 30 మందికి గాయాలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ దుదుకాబహాల గ్రామంలో తేనేటీగలు దాడి చేయడంతో 30 మందికి పైగా గాయపడ్డారు. మంగళవారం సాయంత్రం అమ్మవారి జాతర సందర్భంగా మామిడి తోటలో గ్రామస్తులంతా కలసి అనుపోత్సవం నిర్వహిస్తున్న క్రమంలో వాయిద్యాలు శబ్దం రావడంతో తేనేపట్టు కదలడంతో తేనెటీగలు దాడి చేశాయి. ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం క్షతగాత్రులు ఇంటికి తిరిగి వెళ్లిపోయారు.

కోవిడ్‌పై అపోహలు వద్దు

- రాష్ట్రంలో కేసుల పెరుగుదల లేదు
- అపోహలు ప్రసారం చేయవద్దు
- మీడియాకు ప్రజారోగ్య డైరెక్టర్ విజ్ఞప్తి



డాక్టర్ నీలకంఠ మిశ్రా, ప్రజారోగ్య శాఖ డైరెక్టర్

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్తగా ఐదుగురికి కరోనా సోకిందనే ప్రచారంలో వాస్తవం లేదని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా బుధవారం స్పష్టం చేశారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని కోరారు. కోవిడ్ కేసులలో అసాధారణ పెరుగుదల లేదని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని చెప్పారు. అపోహలు ప్రసారం చేయవద్దని ఈ సందర్భంగా ఆయన మీడియాకు విజ్ఞప్తి చేశారు. ఇంత వరకు భారత ప్రభుత్వం ఎటువంటి కొత్త మార్గదర్శకాలను జారీ చేయలేదన్నారు. ప్రస్తుతం గుర్తించిన వేరియంట్ జేఎన్.1గా పేర్కొన్నారు. దీని పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జేఎన్–1తో గుర్తించబడిన రోగి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని చెప్పారు. త్వరలో డిశ్చార్జ్ చేస్తామన్నారు. కొత్త కేసులను ఆర్‌టి - పీసీఆర్ ద్వారా నిర్ధారిస్తామన్నారు. ప్రజలు, ముఖ్యంగా బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారు, నివారణ చర్యలను అనుసరించడం కొనసాగించాలన్నారు. ప్రస్తుతం ఆరోగ్య వ్యవస్థ బాగా పనిచేస్తోందని, భయపడాల్సిన అవసరం లేదని డాక్టర్ నీలకంఠ మిశ్రా అభయమిచ్చారు.

భారీగా గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి:

మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు మంగళవారం రాత్రి అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 1,190 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. బలిమెల-చిత్రకొండ ప్రధాన రహదారిలో గల నూగూడ గ్రామ సమీపంలోని అడవిలో గంజాయిని హర్యాణా రాష్ట్రానికి తరలించేందుకు దాచినట్లు ముందస్తు సమాచారం వచ్చింది. బలిమెల పోలీస్ స్టేషన్ ఎస్ఐ మనోహర్ సాహు నేతృత్వంలోని బృందం బలిమెల–యపూరం రహదారిలో సదాశివపూర్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. సమీపంలోని అడివిలో నాలుగురు వ్యక్తులు రెండు బైక్‌లతో గంజాయి బస్తాల వద్ద ఉన్నారు. పోలీసుల రాకను చూసి పారిపోతుండగా వారిలో ముగ్గురిని పట్టుకున్నారు. ఒకరు పారారయ్యాడు. ముగ్గురిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. గంజాయి బస్తాలను స్టేషన్‌కు తరలించారు. బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం గంజాయిని తూకం వేశారు. 1,190 కేజీలు ఉంది. దీని విలువ కోటి రూపాయలు ఉంటుందని బలిమెల ఐఐసీ ధీరజ్ పట్నాయక్ తెలిపారు. నిందితుల్లో ఇద్దరు హర్యాణాకు చెందిన హరిష్ సోనీ, సందీప్ కుమార్, ఒకరు బలిమెల పోలీసు స్టేషన్ పరిధిని నీలకాంబేరి గ్రామానికి చెందిన సునీల్ కుమార్ ప్రదాన్‌గా గుర్తించారు. బుధవారం సాయంత్రం కోర్టుకు తరలించారు. పారారైన వ్యక్తి కోసం గాలిస్తున్నారు.



గంజాయితో పట్టుబడిన నిందితులు



మల్కన్‌గిరి: పట్టుబడిన నిందితులు



మల్కన్‌గిరి: పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

30 కేజీలతో ఇద్దరు అరెస్టు..

మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు బుధవారం మధ్యాహ్నం 30 కేజీల గంజాయిని స్వాధీనం చేకున్నట్లు బలిమెల ఎస్ఐ అజిత్ సింగ్ తెలిపారు. బలిమెల పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల రహదారిలో స్కూటీ అతివేగంగా వస్తూ అదుపు తప్పి పడిపోయింది. ఆ సమయంలో పోలీసులు అక్కడే ఉండటంతో వారిని బలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. స్కూటీలోని రెండు పాలిథిన్ కవర్‌లలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఇద్దరిని అరెస్ట్ చేసి విచారించారు. వీరు చిత్రకొండ సమితి పనాస్‌పూట్ పంచాయతీలో గురుభీలో అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఛత్తీష్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్‌కు తరలిస్తున్నారు. పోలీసులు వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తూకం వేస్తే 30 కిలోలు ఉందని, దీని విలువ రెండు లక్షల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. పూర్తి విచారణ అనంతరం గురువారం కోర్టుకు తరలిస్తామన్నారు. నిందితులు ఇద్దరు బలిమెలకు చెందిన అమాన్ భీలో, రాజి మహోల్దార్‌గా గుర్తించారు.

క్లుప్తంగా

రోడ్డును విస్తరించాలి



సబ్ కలెక్టర్‌కు విన్నవిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బసంత పండా

పర్లాకిమిడి: పట్టణంలోని టౌన్ రోడ్డును పూర్తిగా విస్తరించాలని, దీనిపై రెండేళ్ల క్రితం ఖంజా వీధి నుంచి మార్కెట్, కొత్త బస్టాండ్ వరకు సేకరించిన భూమిని డెవలప్‌మెంట్ చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బసంత పండా బుధవారం కలెక్టర్‌కు రాసిన వినతిని సబ్ కలెక్టర్ అనుప్‌పండాకు కలెక్టరేట్‌లో అందజేశారు. పట్టణంలో పలు కూడళ్లల్లో ఆక్రమణదారులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించారన్నారు. రోడ్లు-భవనాల శాఖ ఇంజినీర్లు ఎందుకు రోడ్డును విస్తరించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. పలుకుబడి ఉన్న వ్యాపారుల దుకాణాలను తొలగించకుండా పనులు సాగిస్తున్నారని వివరించారు. దీనిపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి టౌన్ రోడ్డును 66 అడుగుల మేరకు విస్తరించాలని కోరారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

రాయగడ: జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి సికిరపాయిలో నివసిస్తున్న గోపాలశెఠి ఉపేంద్ర ఇంట్లో ఇటీవల జరిగిన చోరీ కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో సికరపాయి గ్రామానికి చెందిన గెంబలి చందన్ కుమార్, గురుతులి గ్రామానికి చెందిన గుడ్ల సంతోష్‌కుమార్ ఉన్నారు. గత నెల 11వ తేదీన ఇదే కేసుకు సంబంధించి ఈశ్వర్ నాయక్ అనే నిందితుడిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ప్రత్యేకంగా ఏర్పడిన పోలీస్ బృందం ఈ మేరకు దర్యాప్తు చేస్తుంది. బిసంకటక్, కాసీపూర్, జేకేపూర్ నియమగిరి పర్వత ప్రాంతాల్లో విస్తృతంగా గాలిస్తున్న ఈ బృందం ఈ మేరకు నిందితులను పట్టుకోవడంలో సఫలీకృతమవుతుంది. కళ్యాణ సింగుపూర్ ఐఐసీ నీలకంఠ బెహెర మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు.

దాడి కేసు నమోదు



చికిత్స పొందుతున్న హరికృష్ణ

కవిటి: మండలంలో డి.గొనపపుట్టుగ గ్రామంలోని ఎస్సీ వీధికి చెందిన బోనేల హరికృష్ణపై ప్రత్యర్థి వర్గీయులు దాడిచేసి గాయపర్చడంతో 108 అంబులెన్స్‌లో కవిటి ప్రభుత్వ ఆస్పత్రి వెళ్లాడు. అక్కడి ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు కవిటి పోలీస్‌స్టేషన్‌లో బోనేల హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంఎల్‌సీ కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.రవివర్మ బుధవారం తెలియజేశారు. తన కొబ్బరితోటలో కాయలు, కమ్మలను ప్రత్యర్థి వర్గంవారు తీసుకెళ్తుంటే అడ్డుకున్నాననే నెపంతో కర్రలతో కొట్టి, కారంచల్లి తీవ్రంగా గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. అదే విధంగా ఈ కొట్లాటలో తమకు కూడా గాయాలయ్యాయని ప్రత్యర్థి వర్గీయురాలు తెంబ సరోజిని అనే మహిళ సైతం కవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు.

సంక్షేమ పథకాలపై.. అవగాహన తప్పనిసరి



హాజరైన ఏఎల్ఓ, ట్రైనీ ఏడీడబ్ల్యూఓలు

- అధికారులు సమగ్ర సమాచారం కలిగి ఉండాలి
- శిక్షణా కార్యక్రమంలో గవర్నర్ కంభంపాటి హరిబాబు

భువనేశ్వర్: అధికారులే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అన్నారు. ప్రజలకు, ముఖ్యంగా సమాజంలోని పేద, బలహీన వర్గాలకు మెరుగైన సేవలందించడానికి సమగ్ర సమాచారం అవసరమని చెప్పారు. గోపబంధు అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పొందుతున్న సహాయ కార్మిక అధికారి (ఏఎల్ఓ), అదనపు జిల్లా సంక్షేమ అధికారుల (ఏడీడబ్ల్యూఓ)ను ఉద్దేశించి బుధవారం గవర్నర్ ప్రసంగించారు. అధికారులు తమ విభాగాలకు సంబంధించిన పథకాలకే పరిమితం కాకుండా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని పథకాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ముద్ర యోజన (పీఎమ్ఎంవై), ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై), సుభద్ర యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) వంటి అనేక ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలు సమాజంలో పలు వర్గాల కోసం ఉద్దేశించబడినవిగా పేర్కొన్నారు. కార్మికులు, మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ముఖ్యంగా బలహీన గిరిజన సమూహాలకు పథకాల లబ్ధి చేకూర్చేందుకు అధికారులు సమగ్ర సమాచారం కలిగి ఉండాలన్నారు. స్కాలర్‌షిప్‌లు, న్యాయ సహాయం, పరిహారం, కులాంతర వివాహాలకు మద్దతు, బలహీన గిరిజన వర్గాలకు బీమా సౌకర్యం వంటి ప్రయోజనాలను పొందేలా అధికారులు పనిచేయాలన్నారు. ఏఎల్ఓ శిక్షణార్థులతో మాట్లాడుతూ వారిని కార్మికుల హక్కుల సంరక్షకులుగా అభివర్ణించారు. కార్మిక చట్టాలు అమలు, వాస్తవ కార్యాచరణ, న్యాయబద్ధంగా వేతనాలు చెల్లించడం, సురక్షిత పని ప్రదేశాలు కల్పించడం ప్రధాన కర్తవ్యమని చెప్పారు. అసంఘటిత కార్మిక రంగంలో వలస కార్మికులకు మద్దతు, రక్షణ కల్పించేందుకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.బి.ఎస్.రాజ్‌పుట్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గవర్నర్ హరిబాబు

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా

భువనేశ్వర్ : స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ(ఐఐటీ) బుధవారం రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ప్రపంచ రుతుచక్ర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ సౌజన్యంతో జరిగిన ఈ సమావేశంలో, భారత దేశంలో రుతుక్రమ ఆరోగ్య సమస్యలకు వినూతన, సమగ్ర, సుస్థిరమైన పరిష్కారాలను చర్చించడానికి విధాన నిర్ణేతలు, ప్రజారోగ్య నిపుణులు, అభివృద్ధి భాగస్వాములు, సామాజిక ఆవిష్కర్తలు సమావేశమయ్యారు. ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల, కళాశాలలకు వెళ్లే బాలికలలో పునర్వినియోగ రుతుక్రమ ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించే ప్రయత్నంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేర్ (క్యాంపస్ యాక్షన్ ఫర్ రీయూజబుల్ ఎసెన్షియల్స్) నిరుపేద వర్గాల మహిళలకు పర్యావరణ అనుకూలమైన పునర్వినియోగ రుతుక్రమ ప్యాడ్‌లను పంపిణీ చేసింది. అనంతరం శానిటరీ నాప్కిన్ వెండింగ్ మెషీన్లను ప్రారంభించారు. రుతుస్రావం ఒక సహజ జీవ ప్రక్రియగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఐటీ భువనేశ్వర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్, యూనిసెఫ్ ఒడిశా ఫీల్డ్ ఆఫీస్ హెడ్ విలియన్ హన్లాన్ జూనియర్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన ఘటనలో భర్తకు జైలు శిక్ష



హృషికేస్ సాహు

రాయగడ: కట్టుకున్న భార్యను హత్య చేసిన భర్తకు గుణుపూర్ ఏడీజే కోర్టు యావజ్జీవ కారాగార జైలు శిక్షను విధించింది. కేసు న్యాయవిచారణ చేసిన ఏడీజే దేవదత్త పట్నాయక్ ఈమేరకు మంగళవారం నాడు తన తీర్పును ప్రకటించారు. అదేవిధంగా జైలు శిక్షతో పాటు 50 వేల రూపాయలు జరిమానా చెల్లించాలని.. లేనిపక్షంలో మరో సంవత్సరం జైలు శిక్షను అనుభవించాలని తన తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి మరో అయిదుగురు నిందితులను నిర్దోషులుగా తీర్పునిచ్చారు. గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని పద్మపూర్‌లో గల కొత్త వీధిలో నివసిస్తున్న హృషికేష్ సాహు తన భార్య సంధ్యారాణిని గొడ్డలితో నరికి హత్యకు పాల్పడినట్టు సంధార్యాణి చెల్లెలు 2020 జనవరి 27వ తేదీన పద్మపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ కేసుకు సంబంధించి నిందితుడు హృషికేష్ సాహుతో సహా మరో ఐదుగురిపై కేసు నమోదయ్యింది. దీనికి సంబంధించి ఐదుగురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా హృషికేష్ అప్పట్లో పరారయ్యాడు. అనంతరం ఆయనను 2020 అక్టోబర్ 20వ తేదీన హృషికేస్‌ను కూడా పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసు విచారణలోకి రాగా మంగళవారం ఏడీజే పట్నాయక్ 18 మంది సాక్షులను విచారించిన అనంతరం హృషికేష్‌ను ఏవజ్జీవ కారగార శిక్షను విధించగా మిగతా ఐదుగురిని నిర్దోషులుగా విడుదల చేస్తు తీర్పునిచ్చారు.

పార్శిల్ బాంబు కేసులో దోషిగా పుంజిలాల్

భువనేశ్వర్ : బొలంగీర్ జిల్లాలో ఏడేళ్ల కిందట జరిగిన పట్నాగఢ్ పార్శిల్ బాంబు కేసులో స్థానిక ఏడీజే కోర్టు బుధవారం తుది తీర్పు వెలువరించింది. నిందితుడు పుంజిలాల్ మెహర్‌ను దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు విధించింది. ఈ సందర్భంగా నిందితుడు పుంజిలాల్‌ను తెల్లవారుజామున బొలంగీర్ జైలు నుంచి గట్టి భద్రత మధ్య పట్నాగఢ్ కోర్టుకు తరలించింది. 62 మంది సాక్షులతో పాటు నిందితుడు పుంజిలాల్ మెహర్ వాంగ్మూలాలను ముందుగానే నమోదు చేశారు. 2018 ఫిబ్రవరి 23న నూతన వధూవరులైన సౌమ్య శేఖర్ సాహు, రీమా నివాసానికి బహుమతి పేరిట పార్శిల్ వచ్చింది. సౌమ్య శేఖర్ సాహు పార్శిల్ తెరవగానే బాంబు పేలి అతనితో పాటు అమ్మమ్మ జెమామణి సాహు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో నూతన వధువు రీమాకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. సౌమ్య శేఖర్ సాహు తల్లి సహోద్యోగిని అరెస్టు చేశారు.

గుణుపూర్ పాసింజర్ వేళల్లో మార్పులు

పాతపట్నం: ఆంధ్ర-ఒడిశాలను కలుపుతూ ప్రయాణికులకు సేవలందిస్తున్న విశాఖపట్నం – గుణుపూర్ పాసింజర్ రైలు వేళలు జూన్ 1వ తేదీ నుంచి మార్పు చేశారు. రైల్వే అధికారులు తెలిపిన వివరాలు మేరకు తెంబూరు-గుణుపూర్ మధ్య ప్రధానంగా రైలు వేళల్లో మార్పులు జరిగాయి. విశాఖపట్నం - గుణుపూర్ (58506) పాసింజర్ ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి ఉదయం 9.44 గంటలకు తెంబూరు, 9.49 గంటలకు గంగువాడ, 9.59 గంటలకు పాతపట్నం, 10.08 గంటలకు పర్లాకిమిడి, 10.24 గంటలకు సీతాపురం, 10.29 గంటలకు హడ్డుబంగి, 10.39 గంటలకు కాశీనగర్, 10.49 గంటలకు లిహూరి, 10.59 గంటలకు బన్సధార, 11.09 గంటలకు పాలసింగి, 11.55 గంటలకు గుణుపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గుణుపూర్-విశాఖపట్నం (58505) పాసింజర్ మధ్యాహ్నం 1.55 గంటలకు బదులుగా 2.30 గంటలకు గుణుపూర్‌లో బయల్దేరి, 2.40 గంటలకు పాలసింగి, 2.47 గంటలకు బన్సధార, 2.56 గంటలకు లిహూరి, 3.04 గంటలకు కాశీనగర్, 3.15 గంటలకు హడ్డుబంగి, 3.20 గంటలకు సీతాపురం, 3.33 గంటలకు పర్లాకిమిడి, 3.43 గంటలకు పాతపట్నం, 3.52 గంటలకు గంగువాడ, సాయంత్రం 4 గంటలకు తెంబూరు, 4.09 గంటలకు పెద్దసాన, 4.17 గంటలకు చెక్కలి, రాత్రి 9 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. నూతన సమయాలు ప్రయాణికులు గుర్తించాలని రైల్వే అధికారులు సూచించారు.

దొంగతనం కేసులో నిందితులు అరెస్టు

జయపురం: జయపురం సమితి ఎక్బాగుడ గ్రామంలో గత 25వ తేదీన అతుల్య కుమార్ మల్లిక్ ఇంట్లో దొంగతనం జరిగిన విషయం విదితమే. ఆ కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీష్ కాశ్యప్ బుధవారం తెలిపారు. జయపురం పట్టణ పోలీసు స్టేషన్ సభాగృహంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమివేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదుగురు నిందితులను అరెస్టు చేశామని వెల్లడించారు. అరెస్టయిన వారిలో పాప సున, అనిల్ కులదీప్, స్వాధీన పాణిగ్రహి, ఆదిత్య కందర్పన్‌తోపాటు మరో మైనర్ ఉన్నట్టు పేర్కొన్నారు. నిందితులు దొంగిలించిన బంగారు ఆభరణాలతో పాటు రెండు సెల్‌ఫోన్లను, విలువైన వస్తువులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గత 25వ తేదీ రాత్రి ఎక్బాగుడ పంచాయతీ షిర్డీసాయినగర్ వాసి అతుల్యకుమార్ మల్లిక్ ఇంటిలో దొంగతనం జరిగింది. ఆయన ఇచ్చిన ఫిర్యాదు పైకేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారభించామని వెల్లడించారు.

ఎన్‌కేటీ రోడ్డు విస్తరణకు కొలతలు ప్రారంభం



ఎన్‌కేటీరోడ్డులో కొలతలు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది



విస్తరణ చేయనున్న వల్లబాయ్ పటేల్ రోడ్డు

జయపురం: జయపురం మున్సిపాలిటీలోని ఎన్‌కేటీ రోడ్డు విస్తరణకు అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. జయపురం సబ్‌కలెక్టర్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కుమారి అక్కవరమ్ శౌశ్యా రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపాలిటీ ఇంజినీర్లు, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు, పోలీసుల సమక్షంలో 40 అడుగుల రోడ్డు విస్తరణకు కొలతలు ప్రారంభించారు. పట్టణ ప్రధాన మార్గం వల్లబాయి పటేల్ రోడ్డు నుండి నుంచి ఎన్కేటీ రోడ్డును ప్రభుత్వ ఉన్నత పాఠశాల మీదుగా నీలకంఠేశ్వర మందిర కూడలి వరకు ఆక్రమణలు తొలగించి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్టు అధికారులు వెల్లడించారు. అయితే వల్లభాయి పటేల్ మార్గం నుండి 80 మీటర్ల వరకు 30 అడుగుల రోడ్డు ఉంటుందని పేర్కొన్నారు. అందుకు ప్రధాన కారణం 80 మీటర్ల వరకు ఉత్తర వైపు ప్రజల నివాస గృహాలు ఉన్నాయి. దక్షిణ వైపు జయపురం మహారాజు కోట ఎత్తైన ప్రహరీ ఉండటం వలన అంతవరకు 30 అడుగుల వెడల్పు రోడ్డు, అక్కడ నుంచి నీలకంఠేశ్వర మందిర కూడలి వరకు 40 అడుగుల రోడ్డు వేస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రోడ్డు విస్తరణకు కొలతలు ప్రారంభించారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఇంట్లోకి చేరిన కంకర మట్టిని యంత్రాలతో తొలగిస్తున్న దృశ్యం

టెక్కలి: కోటబొమ్మాళి మండలం కొత్తపేట పంచాయతీ కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాలనీలో కొండకు ఆనుకుని ఉన్న నీలాపు రామకృష్ణకు చెందిన ఇంట్లోకి మంగళవారం రాత్రి సమయంలో కొండమీద నుంచి వరదనీటితో పాటు కంకర ఒక్కసారిగా పడిపోవడంతో కుటుంబ సభ్యులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. ఇదే కాలనీలో నివాసముంటున్న వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి ఇంటి వద్దకు వెళ్లి జరిగిన ఘటన వివరించారు. దీంతో రోజారాణితో పాటు ఆమె భర్త రామకృష్ణారెడ్డి వారి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం బుధవారం ఉదయం పంచాయతీరాజ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డీఈ సుధాకర్‌తో పాటు ఇతర అధికారులు ఇందిరమ్మ కాలనీ వద్దకు చేరుకుని మట్టిని తొలగించే చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా ఇందిరమ్మ కాలనీలో నివాసాలకు ఆనుకుని కొండమీద అభివృద్ధి పేరుతో రోడ్డు పనులు చేస్తున్నారు. అయితే ముందస్తుగా అధికారులు సరైన ప్రణాళిక చేపట్టకపోవడంతో ఇటువంటి సంఘటన జరిగినట్లు కాలనీవాసులు చెబుతున్నారు. కొండపైకి రోడ్డు కోసం ఇప్పటికే రెండు ప్రాంతాల్లో పనులు ప్రారంభించారని, ఇప్పుడు ఇళ్లకు ఆనుకుని కొత్తగా రోడ్డు పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. కాలనీవాసులు నివసిస్తున్న ఇళ్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రక్షణ గోడ నిర్మాణం చేపట్టి తదుపరి పనులు చేయాలని కోరుతున్నారు.

నిబంధనలు పాటించాలి

నరసన్నపేట: మద్యం షాపుల్లో విధిగా నిబంధనలు పాటించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ స్పష్టం చేశారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో పోలీసులు నమోదు చేసిన ఎక్సైజ్ కేసులు, వాటి దర్యాప్తుపై సమీక్షించారు. కేసులు మరిన్ని నమోదు చేయాలని సూచించారు. అలాగే ఉదయం 10 గంటల్లోపు షాపులు తెరవకూడదని, రాత్రి 10 గంటల తర్వాత తెరిచి ఉంచకూడదని హెచ్చరించారు. నిబంధనలు పాటించని షాపులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఎక్సైజ్ సీఐ, ఎస్ఐల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎక్సైజ్ సీఐ ఎస్వీ రమణమూర్తి ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



కాశీబుగ్గ: పలాస మండలం టెక్కలిపట్నం పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి కొమలాపురం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఆవు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ లైన్ ఆవుల శాలకు తాకడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించి టొంప సింహాచలంకు చెందిన ఆవు మృతి చెందింది. దీంతో ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి తనను ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు.

జ్వరభద్రం..!



- జిల్లావ్యాప్తంగా వర్షాలు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన



ఇలిసిపురం జంక్షన్‌లో రోడ్డుపైనే డ్రైనేజీ మురుగు

శ్రీకాకుళం:

ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నిన్న, మొన్నటి వరకు విపరీతమైన ఎండవేడిమి ఉండగా, ప్రస్తుతం ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. అందువలన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ కారణంగా వారు తొందరగా వ్యాధుల బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు తినే ఆహారం, తాగేనీరు విషయంలో అప్రమత్తంగా ఉండడంతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని చెబుతున్నారు.


ఖాళీ స్థలాలే ఆవాసాలు

జలుబు, దగ్గు, జ్వరం, అతిసారం, వాంతులు వంటి వాటితో పాటు మరిన్ని అంటువ్యాధులు వ్యాప్తి చెందే పరిస్థితి వర్షాల సమయంలో ఎక్కువగా ఉంటుంది. దీనికి కారణంగా మనం దోమలు, ఈగలను చెప్పవచ్చు. మురికి కాలువులు, ఖాళీ స్థలాలు దోమలు, ఈగలకు ఆవాసాలై వ్యాధులు వ్యాప్తి చేస్తాయి. కొన్ని నెలలుగా కాలువల్లో పూడికలు తొలగించకపోవడం, పారిశుద్ధ్య పనులు అంతంతమాత్రంగా చేయడం వలన వర్షం పడితే కాలువల్లో మురికినీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. అలాగే ఖాళీ స్థలాల్లో నెలల తరబడి నీరు నిలిచిపోయి ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటిపై నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, పంచాయతీలు పట్టించుకోవడం లేదు. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండడం ఎంతో అవసరం. అలాగే పొరుగు జిల్లా అయిన విశాఖపట్నంలో కరోనా కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. మన జిల్లా నుంచి అనేక మంది ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇలా చేయాలి

- కాచి చల్లార్చిన నీటినే తాగాలి.
- వేడిగా ఉన్న అహారాన్ని భుజించాలి.
- వీలైనంత వరకు రోడ్డుపక్కన తినుబండారాలు తినకపోవడమే మంచిది.
- ఆహారం తీసుకునే ముందు చేతులను పరిశుభ్రం చేసుకోవాలి.
- ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అప్రమత్తత అవసరం



అప్రమత్తంగా ఉంటే వ్యాధులు దరిచేరవు. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. మలేరియా, టైఫాయిడ్, డెంగీ నిర్ధారణ అయితే ప్రత్యేక చికిత్స అవసరం ఉంటుంది. – డాక్టర్ కె.రవితేజ, శ్రీకాకుళం

క్లుప్తంగా

రామతీర్థం హుండీల ఆదాయం రూ.29.96 లక్షలు



రామతీర్థం హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీవారి సేవా భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని దేవస్థానం అధికారులు బుధవారం లెక్కించారు. మొత్తం 89 రోజులకు గాను దేవాలయంలో ఉన్న హుండీల ద్వారా రూ.29,76,730 ఆదాయం సమకూరిందని ఈఓ వై శ్రీనివాసరావు తెలిపారు. హుండీల లెక్కింపును దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌లు రాజకుమారి, చీపురుపల్లి కనకమహాలక్ష్మి, దేవస్థానం ఈఓ శ్రీనివాస్ దగ్గరుండి పర్యవేక్షించారు. లెక్కింపులో అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జిల్లాకు చెందిన పలువురు శ్రీవారి సేవా భక్తులు హుండీల ఆదాయ లెక్కింపులో పాల్గొన్నారు.

సారా కేసుల్లో నలుగురి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న సారాను చూపుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం)/జియ్యమ్మవలస రూరల్: కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో బుధవారం జియ్యమ్మవలస మండలం చినమేరంగి, చినదొడిజ గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా కలిగిఉన్న ముగ్గురు వ్యక్తులతో పాటు సారా వండేందుకు ముడిసరుకులు సరఫరా చేసిన మరో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. దాడుల్లో భాగంగా చినదొడిజ గ్రామ పరిసరాల్లో 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో ఆయన వెంట ఎక్సైజ్ ఎస్సై జె.రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య



ఉరివేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ అప్పలస్వామి

సాలూరు రూరల్: పట్టణానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ రెడ్డి అప్పలస్వామి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..స్థానిక రామా కాలనీలో నివాసముంటున్న అప్పలస్వామి (58) అనారోగ్య కారణంతో మనస్తాపానికి గురై ఆర్టీసీ కాంప్లెక్స్ మేడపై ఉరివేసుకున్నాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బి.అప్పలనాయుడు తెలిపారు.

పురుగు మందు తాగి మహిళ..



సూర్యకాంతం (ఫైల్)

గుర్ల: మండలంలోని పాలవసలకు చెందిన కోడి సూర్యకాంతం (45) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే కొద్దిరోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది, ఆ బాధను భరించలేక మూడు రోజుల క్రితం పురుగు మందు తాగేసింది. అనంతరం అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

విత్తనాల గొడౌన్ పరిశీలన



విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏ మహరాజన్, తదితరులు

బొండపల్లి: మండలంలోని నెలివాడలో గల ఏపీ సీడ్స్ వరి విత్తనాల గొడౌన్‌ను వ్యవసాయ శాఖ గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గొడౌన్‌లోని ఐదు చోట్ల శాంపిల్స్ సేకరించారు. వీటిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించనున్నట్లు ఏడీఏ తెలిపారు. రైతుల నుంచి సేకరించిన విత్తనాలకు అన్ని పరీక్షలు నిర్వహించామని అధికారులు ఏడీఏ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఏడీఏ స్పందిస్తూ మరోసారి పరీక్షలు నిర్వహించిన తర్వాత రైతులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ పి.వి.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

తియ్యని విషం..!

- త్వరగా పక్వానికి వచ్చేలా వ్యాపారుల అడ్డదారులు
- యథేచ్ఛగా కార్బైడ్ వినియోగం



మార్కెట్‌లో లభిస్తున్న మామిడి పండ్లు

పార్వతీపురం: తీపిని పంచాల్సిన పండ్లు కడుపులో విషాన్ని నింపుతున్నాయి. మామిడి ప్రియుల ఆరోగ్యంపై దాడి చేస్తున్నాయి, సహజసిద్ధంగా పండాల్సిన పండ్లను కృత్రిమ పద్ధతిలో (త్వరగా పండేలా నిర్దేశిత ప్రమాణాలకు మించి కాల్షియం కార్బైడ్ వినియోగం) మగ్గబెడుతున్నారు. కంటికి అందంగా కనిపించేందుకు వ్యాపారులు వ్యాక్స్, సింథటిక్ కలర్లు అద్దుతున్నారు. వెరశి తరచూ వాటిని కొనుగోలు చేసి తిన్నవారికి ఆరోగ్య సమస్యలు (జీర్ణకోశ, శ్వాసకోశ, నాడీ సంబంధిత సమస్యలు, చర్మంపై దద్దుర్లు) వచ్చే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు మార్కెట్‌లలో తనిఖీలు నిర్వహించాల్సిన మార్కెటింగ్, ఫుడ్ సేఫ్టీ అధికారులు, తూనికలు కొలతల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో వ్యాపారులు ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారు. మార్కెట్‌కు వచ్చిన కాయలను త్వరగా మగ్గించి, అంతే త్వరగా సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో మోతాదుకు మించి రసాయనాలు వాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

రుచీ పచీ లేక..

విపరీతమైన మంచు కారణంగా పూత దశలోనే చాలావరకు పంట దిగుబడి తగ్గింది. అంతో ఇంతో కాసిన కాయలు ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షాలకు నేల రాలాయి. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. మామిడి కాయలను వివిధ రసాయనాలు వినియోగించి ముగ్గబెడుతున్నారు. గతంలో రూ.30కు విక్రయించిన మామిడి పండ్లు ఈఏడాది రూ. 50కి విక్రయిస్తున్నారు. కంటికి అందంగా, సువాసన వెదజల్లే ఈపండ్లను తినేందుకు పిల్లలతోపాటు పెద్దలు సైతం ఇష్టపడుతున్నారు. ధర ఎక్కువగా ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తున్నారు. తీరా తిన్న తర్వాత రుచి లేకపోవడంతో ఉసూరుమంటున్నారు.

ఏది సహజమో? ఏది కృత్రిమమో..?

సహజంగా పండిన పండు ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగు మిశ్రమంతో కనిపిస్తుంది. ఇది సువాసన వెదజల్లడంతోపాటు పుల్లగా, తియ్యగా, రుచిగా ఉంటుంది. నీళ్లలో వేస్తే మునిగిపోతుంది. రసాయనాలతో పండిన పండుకు ఎలాంటి వాసన ఉండదు. పూర్తిగా పసుపు రంగులో కనిపించడంతో పాటు నీటిలో ఇట్టే తేలిపోతుంది.

రసాయనాలతో అనర్థం

మామిడి పండ్లను త్వరగా మగ్గబెట్టేందుకు కాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తుంటారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ వంటి సంస్థలు సైతం దీన్ని నిర్దేశిత ప్రమాణాల్లో వాడుతుంటాయి. మెజార్టీ వ్యాపారులు మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే కార్బైడ్‌ను వినియోగిస్తుంటారు. కార్బైడ్‌లో ఆర్సెనిక్, పాస్పరస్ అవశేషాలు ఉండటంతో జీర్ణకోశ, శ్వాసకోశ, నాడీ సంబంధిత వ్యాధులు వస్తాయి.

జిల్లాలో 4వేల హెక్టార్లలో సాగు

పార్వతీపురం మన్యం జిల్లాలో 4వేల హెక్టార్లలో మామిడి పంటను సేద్యం చేస్తున్నారు. హెక్టారుకు సరాసరి నాలుగు టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది పంట పూత ఆలస్యంగా రావడం ఇతరత్రా ప్రకృతి వైపరీత్యాల ప్రభావం మామిడి పంట దిగుబడిపై ప్రభావం చూపాయి. హెక్టారుకు ఒక టన్నుకు మించి దిగుబడి రాని పరిస్థితి ఉంది. దీంతో మామిడి రైతులు నష్టాలలో ఉండగా, మామిడిపండ్లు తినే ప్రియులకు ధరలు అమాంతం పెంచేశారు. మంచి రంగుతో పాటు కళకళలాడేలా మామిడి కనిపించేలా అవసరమైన రసాయన చర్యలను వినియోగిస్తున్నారు. నిషేధిత రసాయనాలు వాడుతున్నారు. ఫలితంగా ఇవి రోగాలను ప్రోత్సహించేవిగా మారుతున్నాయి. పార్వతీపురం, పాలకొండ తదితర ప్రాంతాలలో మామిడి పండ్లకు ప్రత్యేక మార్కెట్లున్నాయి.

ఆరోగ్యంపై ప్రభావం..



కలుషిత రసాయనాలు, నిషేధిత రసాయనాలు వినియోగించి ముగ్గబెట్టిన పండ్లను ప్రజలు తినరాదు. అలా వాటిని కొనుగోలు చేసి తింటే జీర్ణకోశ, నాడీసంబంధిత వ్యాధులు వస్తాయి. రంగు మార్చేందుకు పండ్లను ప్రమాదకర రసాయనాలతో మాగబెడుతుంటారు. తినేముందు పరిశీలించి తినాలి.

డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం జిల్లా

ఆడిట్‌కు నిరీక్షణ

- అసహనం వ్యక్తం చేసిన గురువులు



సమయానికి ఆడిట్ బృందం రాకపోవడంతో ఎంఈఓ ఆఫీస్ ముందు ఎదురుచూస్తున్న హెచ్‌ఎంలు



జమాఖర్చులపై ఆడిట్ నిర్వహిస్తున్న ఆడిట్ సభ్యుడు

బొబ్బిలిరూరల్: పాఠశాల నిర్వహణ కోసం ప్రభుత్వం అందిస్తున్న నిధుల వినియోగంపై నిర్వహిస్తున్న ఆడిట్ గందరగోళంగా మారింది.సరైన సదుపాయాలను కల్పించకుండా బుధవారం జరిగిన ఆడిట్‌కు ఏకంగా ఆరు మండలాల నుంచి ఎలిమెంటరీ, యూపీ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులను రప్పించారు. వారంతా పదిగంటలకే హాజరై కార్యాలయాల వద్ద పడిగాపులు కాసినా ఆడిట్ బృందం రావడం ఆలస్యం కావడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాఠశాలల్లో నిర్వహణ ఖర్చులకింద ఇస్తున్న నిధుల వినియోగంపై ప్రైవేట్ ఏజెన్సీ లకు ఆడిట్ అధికారం అప్పగించడంతో వారు తమకు అనుకూల సమయాన్ని ఎంచుకుని ఆడిట్ నిర్వహిస్తున్నారని పలువురు గురువులు గుర్రుమన్నారు. సమయపాలన లేకుండా క్రమశిక్షణ నేర్పిస్తున్న గురువులకే పరీక్షలు పెడుతున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు.శిథిలావస్థలో ఉన్న చిన్నచిన్న గదులున్న ఎంఈఓ కార్యాలయం, భవిత కేంద్రంలో చీకట్లో ఆడిట్ నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చింది.

ఆడిట్ ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసర పనుల నిర్వహణకు హైస్కూల్‌కు రూ.90వేలు, యూపీకి రూ.12వేలు, ఎలిమెంటరీ పాఠశాలలకు రూ.9 వేలు చొప్పున ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. ఇందులో భాగంగా గతేడాది ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వరకు ఆయా పాఠశాలల్లో జరిగిన జమాఖర్చులపై బుధవారం ప్రైవేట్ ఏజెన్సీ సంస్థతో ఆడిట్ నిర్వహణ జరిగింది. బ్యాంకు పాస్‌పుస్తకాలు, ఓచర్లు, బిల్లులను పరిశీలించారు. ఈ ఆడిట్‌లో ఆరు మండలాలకు చెందిన ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆడిట్ బృందం పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లో త్వరితగతిన అరెస్టులు

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి సమావేశంలో పాల్గొన్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షించి గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను త్వరితగతిన అరెస్టు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, నిందితుల అరెస్టు, నేరాలు పునరావృతం చేసే వారి ఆస్తుల జప్తు, పెండింగ్ నాన్ బెయలబుల్ వారెంట్స్, డీ-అడిక్షన్ కార్యక్రమాలపై రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సమగ్రంగా చర్చించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాలకొండ డీఎస్పీ రాంబాబు, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జీడి పిక్కల వ్యాపారి షాప్/ఇంటికి తాళాలు



ఎల్విన్‌పేటలో జీడి పిక్కల వ్యాపారి షాప్‌నకు తాళం వేస్తున్న గిరిజన, దళిత నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట గ్రామానికి చెందిన జీడి పిక్కల వ్యాపారి షాప్, ఇంటికి బుధవారం గిరిజన, దళిత నాయకులు నిమ్మక సింహాచలం, అడ్డాకుల చిన్నారావు, ఎస్.రామారావు తదితరులు తాళాలు వేశారు. ఈమేరకు ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద రవి ఏజెన్సీస్ పేరుతో కొన్నేళ్ల నుంచి వ్యాపారం చేస్తున్న జి.రవికుమార్ జీడిపిక్కలు, ధాన్యం విక్రయించిన వందల మంది రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు స్థానికంగా పలువురి నుంచి రూ.లక్షల్లో అప్పులు చేసి ఏవరికీ ఏమీ చెల్లించకుండా, ఏ సమాచారం ఇవ్వకుండా పరారయ్యాడు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోందని.. ఐపీ పెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడని తమకు రావాల్సిన డబ్బుల సంగతి ఏమిటంటూ పలువురు బాధితులు ఆ వ్యాపారి షాప్ ముందు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. పలువురి నుంచి రూ.2 కోట్లకుపైగా అప్పులు చేశాడని, తన ఇల్లు ,షాప్‌ను కూడా ఎవరికో రాసిపెట్టి వెళ్లిపోయాడన్న సమాచారం ఉందని, కావునే బాధితులందరికీ న్యాయం జరగాలన్న ఉద్దేశంతో వ్యాపారి ఇల్లు , షాప్‌కు తాళం వేసినట్లు నాయకులు తెలియజేశారు. ఈ సంఘటనపై ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని వారంతా పేర్కొన్నారు.

'గురుదేవా'లో చోరీ..!

- పెద్దమొత్తంలో బంగారం, నగదు పోయినట్లు సమాచారం
- ఘటనా స్థలంలో ఏఎస్పీ సౌమ్యలత విచారణ

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు చొరబడి పెద్ద మొత్తంలో బంగారం , నగదు దోచుకుపోయినట్లు తెలిసింది. ట్రస్టు ఆవరణలోనే జగదీష్‌బాబు నివాస సముదాయం ఉంది. నగదు, బంగారం దేవుడి గదిలో ఎప్పటి నుంచో ఉంచుతున్నట్లు భోగట్టా. ఈ మేరకు మంగళవారం అర్ధరాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో దొంగలు చొరబడినట్లు తెలుస్తోంది. ఉదయం ఇంటిసభ్యులు లేచి చూసేసరికి దేవుడి గది చిందరవందంగా ఉండడంతో పరిశీలించగా బంగారం, డబ్బు కనిపించకపోవడాన్ని గుర్తించారు. ఈ మేరకు ట్రస్టు నిర్వాహకుల సమాచారంతో సీఐ సీహెచ్.షణ్ముఖరావు సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలన చేశారు. విజయనగరం నుంచి ప్రత్యేక క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలను సేకరించింది. అనంతరం ఏఎస్పీ సౌమ్యలత ఘటనా స్థలానికి చేరుకుని సంబంధిత పూజా గది, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వివరాలు వెల్లడించేందుకు ఆమె నిరాకరించారు. ఈ విషయమై సీఐ షణ్ముఖరావును వివరణ కోరగా.. ఎంతమొత్తంలో చోరీ జరిగిందో ఇంకా చెప్పలేమని, ఫిర్యాదు కూడా అందలేదని చెప్పారు.

సామాజిక అధ్యయనం సర్వే అడ్డగింత



అడ్డుకున్న గిరిజనులకు నచ్చజెబుతున్న అధికారులు

- అధికారులను తిప్పి పంపిన గిరిజనులు

వేపాడ: మారిక గిరిజన గ్రామాన్ని, భూములను అదానీ కంపెనీకి అప్పగించవద్దంటూ 35 రోజులుగా సచివాలయం నుంచి కలెక్టర్ వరకు విన్నపాలు చేసుకున్నప్పటికీ సామాజిక అధ్యయనం సర్వే అధికారులను ప్రభుత్వం పంపడంపై గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వేపాడ మండలంలోని కరకవలస గిరిశిఖర మారిక గ్రామాన్ని, భూములను సామాజిక అధ్యయనం చేసేందుకు వల్లంపూడి ఎస్సై సుదర్శన్ నేతృత్వంలో పోలీస్ బందోబస్తుతో.. మండలస్థాయి అధికారులు తహసీల్దార్ రాములమ్మ, ఎంపీడీఓ సూర్యనారాయణతో కలిసి వెళ్లిన అధికారులను మారిక పొలిమేరలోనే గిరిజనులు అడ్డుకుని వెనక్కి పంపారు. మా పొలాలను గ్రామాన్ని అదానీ కంపెనీకి ఇచ్చే ప్రసక్తి లేదంటు తెగేసి చెప్పారు. మండలస్థాయి అధికారులు ఎంత నచ్చచెప్పినప్పటికీ గిరిజనులు పట్టు వీడకపోవటంతో అధికారులు వెనుదిరగాల్సి వచ్చింది. కార్యక్రమంలో మారిక గ్రామనాయకులు జలారి వీర్రాజు, బాబూరావు, అప్పలనాయుడు, సోమేష్, శ్రీను ఆసు, శోభన్ బాబు, తదితర గిరిజనులు యువత, మహిళలు పాల్గొన్నారు,

హైడ్రా పవర్ ప్రాజెక్టు భూసేకరణపై ప్రకటన

మండలంలో కరకవలస పంచాయతీ గిరిశిఖర మారిక కొండపై రైవాడ ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రా పవర్ ప్రాజెక్టు భూసేకరణపై ఎస్ఐఏ అధికారుల పర్యవేక్షణకు బుధవారం శ్రీకారం చుట్టామని సామాజిక ప్రభావ అంచనా నివేదిక సామాజిక నిపుణుడు పి.దేవరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సుమారు 8 కి.మీ కాలినడకన మారిక వెళ్లి ఫీల్డ్ వెరిఫికేషన్ చేసినట్లు తెలిపారు. భూసేకరణ చట్టం 2013పై గిరిజనులకు వివరించి సామాజిక ఆర్థిక, సాంఘిక సర్వేకు సహకరించాలని కోరామన్నారు. అయితే ఈ ఇన్‌స్పెక్షన్‌లో నిర్వాసితులు, పెద్దలు, ఎస్ఐఏ బృందం సభ్యులు, మండల రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓను అడ్డగించారని తెలిపారు. గిరిజనుల అభిప్రాయాలను తమనివేదికలో కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

వైద్య శాఖలో బదిలీ ఫీవర్..!

- ఏళ్లతరబడి ఒకేచోట పనిచేసిన వారిలో గుబులు
- ఏదో కారణం చెప్పి తప్పించుకుంటున్న పరిస్థితి



డీసీహెచ్‌ఎస్ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: వైద్యవిధాన్ పరిషత్ కార్యాలయంలో ఓ ఉద్యోగి 10 ఏళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్నట్లు సమాచారం. ఒకే చోట పనిచేయడం వల్ల అధికారులను సైతం శాసించే విధంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారిగా ఎవరు వచ్చినా సదరు ఉద్యోగి మాటే చెల్లుబాటవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే శాఖలో మరో ఉద్యోగి కూడా ఐదేళ్లకు పైగా ఒకే చోట పనిచేస్తున్నాడు.

ఇలా వీరిద్దరే కాదు. మరి కొంతమంది ఉద్యోగులు కూడా ఒకే చోట ఏళ్ల తరబడి పనిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఏ శాఖలో అయినా 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారి వివరాలు జాబితాను వెల్లడిస్తారు. కానీ వైద్యవిధాన్ పరిషత్ అధికారులు మాత్రం అ శాఖలో 5 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారి వివరాలు ఇవ్వడానికి అంగీకరించడం లేదు. లోపాలు బయట పడతాయనో, మరో కారణం చేతనో వివరాలు వెల్లడించడం లేదు. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న వారి వివరాలు బయట పడతాయనే ఉద్దేశంతోనే అధికారులు వివరాలు వెల్లడించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైద్యవిధాన్ పరిషత్ పరిధిలో ఆస్పత్రుల వివరాలు

వైద్యవిధాన్ పరిషత్ పరిధిలో ఎస్.కోట, గజపతినగరం, చీపురుపల్లి, రాజాం ఏరియా ఆస్పత్రులు, బాడంగి, భోగాపురం, బొబ్బిలి, నెల్లిమర్లలో సీహెచ్‌సీలు ఉన్నాయి. వాటి పరిధిలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, జూనియర్ అసిస్టెంట్స్, సీనియర్ అసిస్టెంట్స్ సూపరింటెండెంట్స్, ఎంఎన్‌ఓ, అటెండర్స్, ఏఓ తదితర కేడర్లలో ఉద్యోగులు పనిచేస్తున్నారు.

దీర్ఘకాలం ఒకేచోట పని చేస్తే అవినీతికి ఆస్కారం

ఉద్యోగులు ఒకే చోట ఏళ్ల తరబడి పనిచేయడం వల్ల అవినీతి, అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఉద్యోగ నియామకాల్లో నూ ఇటువంటి వారు తమ వారికి ఉద్యోగాలను కట్టబెట్టుకునే అవకాశం ఉందనే విమర్శలు ఉన్నాయి.

వైద్యారోగ్యశాఖలోనూ ఇదే పరిస్థితి:

వైద్యారోగ్యశాఖలో కూడా ఇటువంటి పరిస్థితే నెలకొంది. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి కావడంతో ఇక్కడ కూడా ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. వివిధ కేడర్లలో ఉద్యోగులు ఇక్కడ కూడా ఒకే చోట పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

పారదర్శకంగా బదిలీలు

ఐదేళ్లకు పైబడి ఒకే చోట పనిచేసిన వారి వివరాలు వెల్లడించడానికి ఉన్నతాధికారుల పర్మిషన్ అడిగాం. పర్మిషన్ రాకపోవడంతో వివరాలు వెల్లడించలేదు. బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తాం

డాక్టర్ ఎస్.పి. పద్మశ్రీరాణి, డీసీహెచ్‌ఎస్

30న మోడల్ పరీక్ష

విజయనగరం గంటస్తంభం: స్థానిక గురజాడ గ్రంథాలయం కేంద్రంగా ఈ నెల 30న డీఎస్సీ మోడల్ పరీక్షను నిర్వహించనున్నామని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ తెలిపారు. బుధవారం ఎల్బీజీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌జీటీ అభ్యర్థులకు మాత్రమే పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రశ్నపత్రాన్ని విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. రూ.50 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8019273486, 7095956895 నంబర్లను సంప్రదించాలన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడు సతీష్ ఉన్నారు.

దివ్యాంగుల గుర్తింపు సర్వే

గంట్యాడ: దివ్యాంగ చిన్నారులను గుర్తించడానికి సర్వే నిర్వహించనున్నట్లు ఎంఈఓ విజయకుమారి తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వాళ్లను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మండలంలోని నరవ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో రమేష్, పాల్గొన్నారు.

యోగాపై వ్యాసరచన పోటీలు

విజయనగరం: విద్యార్థి దశ నుంచే యోగా పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా అన్ని సచివాలయాలలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో చేపట్టిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యోగాంధ్ర 2025 కార్యక్రమంలో ప్రభుత్వం అనేక అంశాలను పొందుపరిచిందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు యోగాపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్నతనం నుంచి యోగాసనాలు అభ్యసనం చేయడం ద్వారా చురుకుదనంతో పాటు, మేధోశక్తి పెరిగే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు ఈ దిశగా పిల్లలను యోగా పట్ల చైతన్యవంతులను చేయాలని కోరారు.

స్కూటర్ ఢీకొని వ్యక్తి మృతి



దుర్మరణం చెందిన అప్పలనాయుడు

విజయనగరం క్రైమ్: నగరానికి సమీప గ్రామం చెల్లూరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. చెల్లూరు గ్రామానికి చెందిన అప్పలనాయుడు విశాఖ-విజయనగరం హైవేపై రాంగ్ రూట్‌లో సాయంత్రం 4 గంటలకు రోడ్డు దాటుతుండగా ఎదురుగా స్కూటర్ రావడంతో ఢీ కొనగా అక్కడికక్కడే కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించే లోగానే తుదిశ్వాస విడిచాడు. మృతుడి కుమార్తె రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మరొకరు..



ఘటనా స్థలంలో శ్రీనివాస రావు మృతదేహం

బొబ్బిలి: ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని బలిజిపేట రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటనపై సీఐ కె.సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం జగ్గునాయుడి పేటకు చెందిన శ్రీనివాసరావు తాపీ, సెంటరింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శనివారం పట్టణంలోని టీచర్స్‌కాలనీకి బైక్‌పై వెళ్తుండగా బలిజిపేట రోడ్డులోని ఇండియన్ బ్యాంకు వద్దకు చేరుకునేసరికి వెనుక నుంచి వస్తున్న శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొనడంతో బస్సు వెనక చక్రాలకింద పడి శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య ఇందిర, పాలిటెక్నిక్ చదివిన పవన్, హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్న చంటి అనే ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి ప్రమాద వాహనాలను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు. ట్రాఫిక్ ఎస్సై వి.జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతూ ఇంకొకరు..



కేజీహెచ్‌లో మృతి చెందిన మధు

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..ఈనెల 25వతేదీ రాత్రి గంట్యాడ మండలంలోని రామవరం జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని బైక్‌పై వస్తూ ఢీకొట్టిన సారిక గ్రామానికి చెందిన కింతాడ మధు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబసభ్యులు కేజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

కుక్క కరిచి వైఎస్సార్‌సీపీ కార్యకర్త..



సత్తారు సన్యాసిరావు

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువలో కుక్క కరిచి వైఎస్సార్‌సీపీ కార్యకర్త బుధవారం మృతిచెందాడు. దీనిపై మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త,గత ప్రభుత్వంలో గ్రామ వలంటీర్‌గా పనిచేసిన సత్తారు సన్యాసిరావు (34)ఈ నెల 3వ తేదీన కుక్కకాటుకు గురయ్యాడు. దీంతో వెంటనే గ్రామ పరిధిలో ఉన్న ఆరికతోట పీహెచ్‌సీకి వెళ్లి రేబిస్ టీకా వేసుకున్నాడు. మూడు డోసులు వేసుకోవాల్సి ఉండగా ఇప్పటివరకు రెండు డోసులు వేసుకున్నాడు.వచ్చే నెల ఒకటో తేదీన మూడో డోసు వేసుకోవాల్సి ఉంది. అయితే ఇంతలో ఈ నెల 27వ తేదీన తలనొప్పి, కుక్క కరిచిన వైపు తిమ్మిర్లు వచ్చాయి. ఆఖరి డోసు రేబిస్ వేసుకుంటే తగ్గిపోతుందన్న ఉద్దేశంతో మిన్నకుండిపోగా బుధవారం ఉదయం అకస్మాత్తుగా మృతి చెందాడు.